# పాకజీవులు

సరోజ పుట్టింటికి వెళ్ళింది.

*　　*　　*

ఆరోజు పొద్దున్న శేషగిరి యింట్లో చిన్న శబ్ద్యత్రయ సమావేశం. నాతిగల బ్రహ్మచారి శేషగిరి మొదటివాడు. తదితరు లిద్దరూ "శతమర్కటం"—గాళ్లు.

— "ఎన్నడూ హోటల్ భోజనం, మాత్రం చేయకు." అన్నాడు శేషగిరి మిత్రుడు జూనియర్ శుకుడు.

"ఆమాట ముమ్మాటికీ కోటి వరాలమాట. పూర్వ జన్మలో, అది ఇవనక, రాత్రింబగళ్ళు కృషిచేసి, పంచ మహాపాతకాలనూ అదేపనిగా చేస్తే ఈ జన్మలో శిక్ష ఏవిటో తెలుసా?... హోటల్ భోజనం...." సీనియర్ శుకుడు ఉవాచ.

"అబ్బా!" అన్నాడు శేషగిరి గడ్డం గోక్కుంటూ. "ఆ... అంతే... రెండు నెలల క్రింద నేను కేంపుమీద ఓ వూరెళ్లాను. ఓ హోటల్లో భోంచేశాను. వంకాయపులుసు వడ్డించాడు. వడ్డిస్తే... వాటిమధ్య ఏముందనుకున్నారూ?"—అని సీరియస్‌గా మిగతా ఇద్దరి మొహాల్లోకి మార్చి మార్చి చూస్తున్నాడు జూనియర్ శుకుడు.

"ఏముంది...?" అన్నాడు శేషగిరి.

"వేటి మధ్య?" అన్నాడు సీనియర్

"ఆ వంకాయల మధ్య—" ఇంకా ప్రశ్న మార్కు మొహంతో వున్నాడు జూనియర్ శుకుడు.

హఠాత్తుగా గజం ఎత్తు పైకెగిరి, జూనియర్ వీపుమీద ఓ చరుపు చరచి "గింజలు!" అన్నాడు శేషగిరి. "ఏడిచినట్టుంది. వంకాయల మధ్య వాటి గింజ లుండక బఠాణీలు వస్తాయా?" అని ఆక్షేపించాడు సీనియర్.

శేషగిరి చరిచిన చరుపుకు చొక్కా ఎన్ని చదరపు అంగుళాలు చిరిగిందో నని చూచుకుని జూనియర్ ఇలా అన్నాడు: "అది కాదర్రా! వంకాయల మధ్య—వంకాయ గింజలుకాక బఠాణీలుకాదు, బాతుగుడ్డొచ్చినా ఆశ్చర్యపడను కానీ—"

"కానీ—"అని ప్రతిధ్వనించాడు సీనియర్ శుకుడు.

"...ఓ చిట్టెలుక వచ్చింది!"

"రామ రామ" అన్నాడు శేషగిరి వణికిపోతూ. "ఎంత అద్భుతమయిన సస్పెన్సూ! పులుసులో—వంకాయల మధ్య—చిట్టెలుక వసుందని ఎవడయినా అనుకోగలడా!!"

"ఒరేయ్ శేషూ! అబ్బాయ్ జానూ! ఇంత సస్పెన్సు భరితమయిన సంఘటన—ఇలా అడుగుకు పడిపోనివ్వడం తెనుగు సాహిత్యానికే తీరని అపచారం! ఏ తత్కారణంబున 'పప్పుపులుసులోచిట్టెలుక' —అనే అపరాధ పరిశోధక గాథ నొకందు రచియించెద..." అన్నాడు సీనియర్.

"అలాకాదు. 'పప్పులుసులో చిట్టెలుకా...?' అని చివరిని నాలుగు చుక్కలూ, ఓ క్వశ్చెన్‌మార్కూ తగిలిస్తే హిచ్‌కాక్—సినిమాలా వుంటుంది" ఈ సలహా జూనియర్ ది.

## రంగారావ్

"కవర్ పేజి మీద ముచ్చటయిన మూడు రంగులో, ధగధగ మండిపోతున్న పొయ్యీ, దానిమీద పొగలు కక్కుతున్న కుండా, ఓ మూల కనీకనపడకుండా చిన్న ఎలుక తోలూకు రేఖాచిత్రమూ గీయించే శావంటే—కాపీలు వేడి పెసరట్లలా అయిపోతాయి" —ఇది శేషగిరి అమూల్యాభిప్రాయం.

"అందుచేతను—ఎటూ మాకు హోటల్ భోజనం తాలూకు మహత్యం అవగతమైంది గనుకా—"

"నీకూ తిండి ప్రశ్న ఉదయించింది కనుకా—"

"శుభంగా రేపొద్దుటినుండీ మీ ఇంటో వంట ఆరంభిద్దాం."

"వంటా? మనమా? అన్నాడు శేషగిరి ఆముదం తాగుతున్నట్టు."

"అబ్బె - అదేముంది...ఇన్ని బియ్యం వుడికించి, అంత ముక్కలు వేయించేస్తే ఎటూ అన్నంలో పాడీ, ఆవకాయా వుండనే వుందీ. పెరుగు సరే...ఇహ జీవితంలో అంతకన్న ఏం కావాలీ - అంటా" — ఆశావాది జూనియర్ ఉద్ఘాటన.

"అయినప్పటికీ..." అని నసుగుతున్న శేషగిరిని పూర్తిచేయనీయక.

"నీకెందుకు, నువ్వూరుకో ... అంతా చూస్తావుగా" అన్నాడు సీనియర్.

"'చూస్తావుగా' ఏమిటీ-'చేస్తాముగా'" అన్నాడు జూనియర్.

"అదేనోయ్, రుచి చూస్తావుగా—"

"ఓ ఎస్! అలాగే కానిద్దాం" అన్నాడు శేషగిరి.

ఆ క్షణాన అంతరిక్షాన గ్రహాలు అనుకూలంగా లేవట!

*　　*　　*

"లే, లెమ్మొ, సోదరా!"

"ఊఁ..." నిద్ర సగం పోతూ నేవున్నాడు శేషగిరి.

"లేవమంటుంటే...?"

"అబ్బ, వూరుకో సరోజా!"

"ఒ - రే...య్!"

"ఓ...నువ్వట్రా జూనియర్! పొద్దున్నే ఏవిటిలా కొట్టుకొచ్చావ్? కాస్సేపాగు... మా ఆవిడ కాఫీచేసి యిస్తుంది" అని ఒళ్ళు విరుచుకుంటూ లేచి కూచున్నాడు శేషగిరి.

ఏదో తీర్మానం చేసుకున్నవాడిలా జూనియర్ శేషగిరి ప్రక్కకొచ్చి కూర్చున్నాడు.

"అబ్బాయ్, శేషగిరీ!"

"తమ్ముడూ, జూనియర్!"

"ఒక యథార్థం చెప్పనా?"

"తప్పకుండానూ"—అన్నాడు ఆవులిస్తున్న శేషగిరి.

"ను...వ్వు"

"ఆ..."

"వదపోసిన—"

"ఆ..."

"కత్తి లేని"

"ఆ..."

"నూటికి నూరుపాళ్ళు శుంఠవిరా"

"ఔ..." అన్నాడు ఆ మధ్యే కర్నూలు వెళ్ళివచ్చిన శేషగిరి. ఇంత ఠంచన్‌గా ఒప్పేసుకున్నాడే అని జూనియర్ ఆశ్చర్యంతో ఇవయిపోతున్నాడు.

"ఎందుకూ?" అన్నాడు శేషగిరి—బీప్ బీప్-లా.

జూనియర్‌కు అందలేదు. 'ఏవిటి—'ఎందుకూ'?" అని అడిగాడు.

"అదేరా నేను కత్తిలేని శుంఠనన్నావే... ఎందుకూ...అని?"

"చెబుతున్నా విను. మొదటిది మీ ఆవిడ ఈ ఇంట్లో కాదుకదా ఈ జిల్లాలోనే లేదు. ఉంటే ఈ ఇంటికి ఫర్లాంగు వ్యాసార్థంలో

# పాకజితులు

మా నీడలు కూడా రావు—ఏం, ఇహ రెండోది: ఇవాళ్టినుంచీ మన ముగ్గురం వంట వండుకుంటున్నాం..."

"ఇంతకీ...ఆ మూడో వ్యక్తి ఎవరో?" అన్న సందేహం వెలిబుచ్చాడు శేషగిరి కళ్లు నులుముకుంటూ.

"మా నాన్నే...మా చిట్టితండ్రే...దా ...మ్మా...చూపెడతా..." అని శేషగిరిని బెడ్ రూం నుండి వంటింటివైపు తీసుకు వెళ్ళాడు జూనియర్.

హాల్లోకొచ్చే సరికి వాతావరణమంతా ఊటీలో డిసెంబరు ఉదయంలాగుంది. జూనియర్, శేషగిరీ వంటింటిగడపదాకా వెళ్లారు. అంతే! ఆ తర్వాత ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేకపోయారు. వంటిల్లంతా పొగతో నిండిపోయి వుంది.

జూనియర్ శుకుడు ఏదో ఉజ్జాయింపుగా వేలు చూపిస్తూ "అదుగో...కొంచితే మన యనుంగు చెలికాడు?" అన్నాడు—అక్కడి పొగ గౌరవార్థం రెండు పొడి దగ్గులు దగ్గుతూ.

జూనియర్ వేలు చూపించిన వైపు ఒక కిటికీ వుండేదని తెలిసిన శేషగిరి, బహుశా జూనియర్ ఆ కిటికీ వెలుపల ఎక్కడో వున్న ఎవరినో చూపెడుతున్నాడు గామోసను కుని—"పొద్దున్నే అనవసరంగా—ఇంకోడి ఊసెందుకు? మనం కాఫీ పెట్టుకుందాం" అన్నాడు.

"సుద్ది వెధవాయా! ఇంకో డేమిట్రా—మంచంకోడు! సీనియర్ మహామునులుం గారు, పుట్టినప్పటినుంచి ఆ పని తప్ప మరోటి చేసి ఎరగనట్టు, విసనకర్రను చేత దాల్చి అదే పనిగా విసురుచున్నారు... కాస్త కళ్ళు తెరిచిచూడు..." అని ఏర్పాటును వివరించాడు. జూనియర్

"విసరడం ఎందుకూ?"

"కుంపటి రాజడానికి!"

"ఓహో, అదా సంగతి?"—అన్నాడు జ్ఞానోదయమయిన శేషగిరి "అదా విషయం. ఇంతసేపు ఇంకా ఏమిటో అనుకుంటున్నాను. మన సీనియర్ గాడు కుంపటి అంటిస్తున్నాడా? పొద్దున్న లేవగానే ఆదేం ఖర్మవాడికీ...!" అన్న శేషగిరికి—దగులూ విసనకర్ర చప్పుడు వినిపించాయి.

ఆ శబ్దాలు వస్తున్న దిశను చూస్తే లీలగా తువ్వాలు కట్టుతున్న సీనియర్ శుకుడు అవుపించినట్టనిపించాడు.

ఇదంతా ఇటువైపు—.

—ఇహ అటువైపు...ఎక్కడో కొన్ని గజాల తర్వాత ఉన్న నూతిలోంచి వినిపించినట్లు గొంతుకలు వినిపించాయి సీనియర్ కి. "దౌర్భాగ్య వెధవల్లారా! ఇంత ఘాతుకులయితే ఎలారా? ఒక శవమేమో అసలు పడక మీదనుంచే లేవదు" లేచిన శవం లేవని శవాన్ని లేపుకొస్తానని వెళ్ళి, తాపీగా వచ్చి, నుంచుని సావకాశంగా బీచి ఒడ్డున సాయంకాలం కూర్చుని వున్నట్లు రెండూ, మాట్లాడుకున్నాయి...హు"

"బ్రదరూ! అలా తిట్టేయకు...మన శేషగిరిని తీసుకొచ్చాను"—అంటూ శేషగిరి జబ్బపట్టుకుని రంగంలోకి ఉరికాడు జూనియర్ శుకుడు.

పొగా – దగులూ సాగుతునేవున్నాయి. జూనియర్ పైకి చూస్తున్నాడు.

శేషగిరి కనుబొమలు చిట్లించాడు. "సీనియర్! నువ్వు కుంపటి విసురుతున్నావని చెప్పావేం జూనియర్?"

"అవునూ!"

"ఏవిటి అవునూ?" అని సీనియర్ శుకుడు ఇంతసేపట్నుంచీ విసురుతున్న విసుర్ల దెబ్బకు తలుకున్న చల్దిఅన్నం కుండను రెండుచేతులతోను కోహినూర్ లా పైకెత్తి పట్టుకున్నాడు శేషగిరి.

"తస్సాదియ్యా! అంత ఇనపకుంపటే ఆవిరయి పోయిందే! ఆ—! బహుశా వేడి ఎక్కువయింది కామోలు"—అన్నాడు సీనియర్.

"మైడియర్ ఫూల్! కొంచెం కుడిప్రక్కకు తిరిగి చూడూ, ఏముందో?" అన్నాడు శేషగిరి.

"కు-మ్-ప-టి" అన్నాడు సీనియర్ - "మేజిక్ కుంపటి" అన్న డిటెక్టివ్ సీరియల్ రాస్తేనో—అనుకుంటూ.

"మరి అంతలావు కుంపటిని చూడకుండానే ఇంతసేపూ విసిరావుటోయ్..." అన్నాడు శేషగిరి సీనియర్ ఓపికను విసుపోతూ..."

"హి—హి—హీ...చూడ లేదోయ్."

"కళ్ళేమయ్యాయీ?" అన్నాడు జూనియర్ కాఫీ ఆలస్యమయి పోతూందే అన్న బాధతో.

"పొగకదూ—కళ్ళు సరిగ్గా కనపళ్ళేదు" అన్నాడు సీనియర్—రెండురెళ్ళు నాలుగు అన్న ధోరణిలో.

జూనియర్ ఆ ఏర్పాటు నంతటినీ కదిలించాడు. కుంపటిక్రిందా, చుట్టుప్రక్కలా, సగంకాలిన కాగితంముక్కలూ, ఓ పాతిక అగ్గిపుల్లలూ వున్నాయి.

"కుంపటి రాజేయడం ఇలాకాదోయ్, మహాశయా! అంత పిడకముక్కమీద ఏదో పోసి నిముషంలో వెల్గించేది మా ఆవిడ!" అన్నాడు శేషగిరి.

"ఏదో ఏమిటే? పిడకమీద కిరొసిన్ పోసి అంటిస్తారు" అన్నాడు జూనియర్.

"కిరొసీనా? మొన్న మా ఆవిడ వెళ్లిపోగానే ఆ సీసా కనుపిస్తే — ఎలక్ట్రిక్ దీపాలుండే ఇంటో అపశ్రుతిలాగు ఇదెందుకని సీసాతో వీధిలో పారేశాను."

"చచ్చితిమి!"—సీనియర్.

"మరి ఇప్పుడేదిదారి?"

కాసేపు ఆలోచనలు. హఠాత్తుగా తుళ్లిపడ్డాడు శేషగిరి. మాట్లాడడం ఆరంభించాడు.

"తమ్ముళ్ళూ! మొట్టమొదటి రోజు—ఇంత నిరుత్సాహపడిపోతే ఎలా? నలభీమాదులు 'క్యూ'లో నుంచుని ఒకముద్దకోసం కాచుకునేరీతిలో, షడ్రసోపేతమయిన, విటమినుయుతమయిన భోజనం మన ఏకైక లక్ష్యం. ఆ లక్ష్యానికి ఈ ప్రస్థానం. ఇంత గొప్పప్రయత్నంలోనూ - ఇది ఒక అత్యల్ప, బహుస్వల్ప విషయం..."

"...అంచేత...?"

"...తక్షణం...హుటాహుటిని, నడుము బిగించి, దీక్షాకంకణధారులమై, ఈ వెధవపని మాని వంటకానిద్దాం" అని చతికిలబడ్డాడు అలిసిపోయిన శేషగిరి.

ఫెడేల్—మని శేషగిరి నెత్తిమీద ఓ మొట్టికాయ మొట్టి, సీనియర్ అన్నాడు: "ప్లానింగు కమిషన్ లో వుండవలసినబుర్ర! అనవసరంగా ఇక్కడ వృథా అయిపోతోంది".

"నిప్పులేనిదే ఏంవంటరా, బ్రదర్?" అన్నాడు జూనియర్ శుకుడు.

"అవు నవును! అసలా వూసే మరచిపోయాను." అని ఇకిలించాడు శేషగిరి.

కాసేపు నిశ్శబ్దం. బొగ్గులబస్తా నానుకుని శేషగిరీ, కాలుమీద కాలు వేసుకుని రోటిమీద కూర్చుని సీనియరూ, కిటికీ వూచలు పట్టుకుని జూనియరూ ఆలోచిస్తున్నారు.

"అద్దదీ!" అన్నాడు జూనియర్.

"ఏది...ఏది..." అన్నాడు శేషగిరి.

"పీచు!" అన్నాడు జూనియర్.

"పీచు—అంటే?" అని అడిగాడు సీనియర్ మిస్టరీ అర్థం కాక.

"పీచంటే-పీచే! అది తెలీదుటోయ్..." అన్నాడు జూనియర్.

"ఒరేయ్! పీచు, గీచు అన్నావంటే నీ పీ చూడిపోగలదు—అదేదో అందరికీ అర్థమయేటట్టు ఏడువు."

"అబ్బబ్బ! ఎంత మట్టిబుర్రలురా మీవి? కొబ్బరి పీచుతో కుంపటి అంటిద్దామంటుంటే అర్థం చేసుకోరేం?" అని వివరిం

(55-వ పేజీ చూడండి)

# ★ పాకజితులు ★

(8-వ పేజీ తరువాయి)

చాడు జూనియర్.

"కొబ్బరి పీచా? ఉన్నట్టు లేదే?"—శేషగిరి.

"అయితే శుభ్రంగా ఓ కొబ్బరికాయ కొంటే సరి..." అని సీనియర్ సలహా ఇచ్చాడు.

"ఒరేయ్ జూనియర్! వేంకసే పావలా పట్టుకెళ్ళి పీచు దట్టంగావున్న కొబ్బరికాయ నొకదాన్ని—లోపల ఎలావున్నా సరే—పట్టుకొచ్చేయి."

కుంపటి వెలిగింది. కాఫీ తయారయింది. మొదటిచుక్క తాగారు.

"ఏదో లోపించినట్లుందే...పాలుతక్కువయినట్టున్నాయి."

"కాదు కాదు...డికాక్షనే ఇంకొంత తగలాలి!"

"చచ్చు వెధవ్రలా—పంచదార తక్కువయినా తెలియదేమిట్రా మీకూ?"

* * *

ముక్కలు తరగడం, కుంపటి విసరడం-వగైరా శేషగిరీ, వండడం-ఇత్యాదులు జూనియర్, పాళ్ళు కలపడం వంట ముఖ్యఅంశాలు-సీనియర్-ఇలా అని నిర్ణయించుకున్నారు.

ఓ కాగితమూ పెన్సిలూ పుచ్చుకుని అర ఘంట ఆలోచించి బీరకాయ పప్పు, బెండకాయకూర, ఉల్లిపాయిలపులుసు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. నిర్ణయం ప్రకారం శేషగిరి ముక్కలు తరిగాడు. బెండకాయ ముక్కలు తరిగి, ఓ వెడల్పాటి గిన్నెలో అర్ధశేరు నీళ్ళుపోసి అందులో ఆ ముక్కల్ని పడేశాడు.

బీరకాయలు తీసుకున్నాడు. ఒక్కొక్క ముక్కా ఓ ఘన అంగుళం వుండేట్టు తరుగుతున్నాడు.

అదేవిటీ ఆ ముక్కలు అంత పెద్దగా తరుగుతున్నావేం?" అని అడిగాడు జూనియర్.

"నోర్మూసుకోవోయ్. ఈ ముక్కలు ఉడికేసరికి ఇంతింతఅవుతాయి." అన్నాడు శేషగిరి.

"మహాశయా! ఇవి మేలురకం 'సాన్ఫొరైజ్ డ్' బీరకాయలు! కాబట్టి కాస్త చిన్నవిగా తరగమని ప్రజలకోరిక..."

"వీల్లేదు. ముక్కలు తరగడం నాఇష్టం... అంతే"

"ఒరేయ్! ఎందుకురా అలా కొట్టుకుంటున్నారూ?"—ఇది సీనియర్.

—బీరకాయలూ, కళ్లనీళ్లు తిరగగా ఉల్లిపాయలూ, ముక్కలయాయి.

"ఇహనేం ముక్కలు చేశారుగా—మీరు పొండి. మిగతావి నేను చూచుకుంటా." అన్నాడు సీనియర్ ధీమాగా.

"అబ్బే—ఇక్కడే కూచుని పేపరు చూచుకుంటూవుంటాం. అవసరమయితే సాయంచేస్తాం." అన్నాడు జూనియర్.


—మరో అరఘంట తర్వాత...

"అన్నం అయిపోయింది" అని ప్రకటించాడు సీనియర్.

"భళి భళీ!" అన్నారు జూనియర్, శేషగిరి పేపరుచూస్తూ.

పోపుపెట్టి అందులో బెండకాయ ముక్కలు వేశాడు సీనియర్. కలియబెడుతూంటే ముక్కలు గొలుసుల్లాగా వస్తున్నాయి.

"వెధవ ముక్కలు—ఇలా జిగటగా తగ



# పాకజితులు

లడ్డారేమిఁ!" అని విసుక్కున్నాడు సీనియర్.

"అదో రకం బెండకాయ కామోసు. దానికి మనమేం చేస్తాం!"

"అంతే అయివుంటుంది. అంతా పరమాత్ముడి ఇచ్ఛ!" అన్నాడు జూనియర్ —

"నేను కాస్త హాల్లోకెళ్ళి గడ్డం గీసుకుంటుంటానూ. అవసరమొస్తే పిలవండేం..." అని జూనియర్ లేచి వెళ్ళాడు.

ఇంకాస్సేపయింది. శేషగిరి పేపరు చూస్తున్నాడు. జూనియర్ గడ్డం గీసుకుంటున్నాడు. ఓ కుంపటిమీద బెండకాయ వేపుడు, మరో దానిమీద బీరకాయ పప్పు అమోఘంగా తయారయిపోతున్నాయి.

ఇంతట్లో సీనియర్ యేదో పనిమీద "అబ్బాయిలూ! కాస్త కుంపటి కనిపెట్టి వుండండి. ఐదునిమిషాల్లో వస్తా" అన్నాడు.

పేపరు చూస్తూ బుర్ర వూపాడు శేషగిరి.

నాలుగు నిముషా లయింది.

అక్కడెక్కడినుంచో సీనియర్ అరిచాడు. "ఒరేయ్, ఒరేయ్—ఆ పప్పులో ఇంత ఉప్పు పడేయండ్రా"—ఒక్కక్షణం షేవింగ్ మాని వంటింట్లో కెళ్ళి ఓ పిడికెడు వుప్పు తీసి పప్పులో పడేసి వెనక్కొచ్చాడు జూనియర్.

పేపరు చదవడంలో తదేకదీక్షతో నిమగ్నుడైవున్న శేషగిరి ఇది గమనించలేదు.

కాళ్ళు చేతులు కడుక్కుని సీనియర్ లోపలికి వచ్చాడు. జూనియర్ స్నానాల గదిలోకి వెళ్ళాడు.

పప్పులో ఉప్పు వేశార్రా?" అని అడిగాడు సీనియర్.

"ఏం వుప్పు?" అన్నాడు శేషగిరి.

"నేను అక్కడి నుంచి అరిచానుగా— వేయమనీ..."

"వినపడందే"—అన్నాడు శేషగిరి పేపరు మడుస్తూ.

'ఇంత' పప్పుకీ 'ఎంత' వుప్పు కావాలో అని ఖచ్చితంగా నిర్ణయించుకొని సీనియర్ కుకుడు పప్పులో యథాశక్తిని మరో పిడికెడు ఉప్పు పడేశాడు. యింతలో వేపుడు మాడువాసన వేయడం మొదలెట్టింది. ఒక్క దూకులో కుంపటి దగ్గరికివెళ్లి, క్షణంలో వేపుడు గిన్నెను తీసి క్రిందవుంచాడు శేషగిరి. వెంఠనే "అమ్మయ్యో" అని పెద్దకేక పెట్టాడు....

"ఏవిటి ఏవిటి?" అన్నాడు ప్రక్కనే వున్న సీనియర్.

కళ్ళవెంబడి నీరు జలజల కారుతుండగా, తన అరచేతుల్ని చూపెట్టాడు. శేషగిరి. పదివేళ్ళూ ఎర్రగా కందిపోయివున్నాయి.

"హరినీ! అంత వేడిదానిని పాతగుడ్డ ముక్కతో పట్టుకు తీయాలిగానీ..."

"అది ముట్టుకున్నేదాక అంత వేడివుందని ఎవడికెరుకా?" అన్నాడు శేషగిరి... వేళ్లకు ఏదో తైలం రాచుకుంటూ.

"శేషగిరీ! ఆ ఖాళీగావున్న కుంపటిమీద పులుసుకు ఓ గిన్నె పడేయివోయ్."అంటూ సీనియరు చింతపండును నీళ్లల్లో కలిపేందుకు ఉపక్రమించాడు. శేషగిరి అలాగే చేసివచ్చి కూర్చుని పేపరువిప్పాడు. చింతపండు నీళ్లని కుంపటిమీది గిన్నెలో పోస్తున్నాడు సీనియర్.

పసిఫిక్ మహాసముద్రంలో ఉదజని బాంబు పేలినట్లు—కుంపటినుండి భుస్సుమంటూ మనిషి ఎత్తున తెల్లటి లావా లేచింది. శేషగిరి దృష్టి నీ దృశ్యం ఆకర్షించింది.

"శేషగిరీ! మీ ఇంట్లో చింతపండు కూడా ప్రత్యేకత వున్నట్టుందే!"

"నీ బుర్రకు స్క్రూలుకూడా సరిగా బిగించనట్టుందే!"

"ఏం?" అని తెల్లబోయాడు సీనియర్ కుకుడు.

"నీవు పైనుంచి పోస్తున్న చింతపండు నీళ్ళు తెల్లటిబూడిదతో కలిసి కుంపటిక్రింద నుంచి మహాప్రవాహంలా వస్తున్నాయి."

స్నానం ముగించి వంటింట్లో అడుగు పెడుతూ ఇలా సెలవిచ్చాడు జూనియర్ -" ఎంతటి అసలు సిసలయిన మూర్ఖులురా మీరు...పావలా కొబ్బరిపిచు పెట్టి వెలిగించిన కుంపటిని నిముషంలో ఆర్పేశారు గదరా..."

"మరి ఈ చచ్చువెధవ కుంపటిమీద ఖాళీ సీసపుగిన్నె పెడతాడని ఎవడనుకున్నాడూ?" అన్నాడు సీనియర్ శేషగిరి వైపు కోపంగా చూస్తూ.

"అదేమో, రోజూ మా ఆవిడ దీంట్లోనే పులుసు పెట్టేది ఎన్నడూ ఇలాకాలేదు." అన్నాడు శేషగిరి ఆ గిన్నె తన్ను అనవసరంగా మోసపుచ్చిందన్న బాధతో.

"అయితే ఇవాళ్టికి పులుసు మానేద్దాం."

"కూర, పప్పు, పెరుగూ వున్నాయిగా.. చాలు."

"నాకేమీ అభ్యంతరంలేదు." అన్నాడు శేషగిరి—

—కుంపట్లు ఆర్పి, ఇల్లు తుడిచి, కంచాలూ, మంచినీళ్ళూ పెట్టుకుని భోజనానికి కూర్చున్నారు.

"మహా ఆకలయిపోతూందిరా!"

"దానికేం, దిట్టంగా పప్పూ, పెరుగూ దంచేసేయ్?

"బెండకాయ వేపుడంటే నాకు రెండో ప్రాణం."

జూనియర్ అన్నం వడ్డించడానికి ప్రయత్నిస్తూన్నాడు. అన్నం గరిటె అన్నం గిన్నెలోనుంచీ రానంటూంది. శక్తికొలదీలాగాడు. వృథా అయింది.

"నువ్వవతల ఉండవోయ్" – అని లేచి ఎడమ మోకాలిని నేలమీద ఆనించి, కుడి పాదాన్ని నొక్కిపట్టి ఎడంచేత్తో ఆ అన్నం గిన్నెను పట్టుకుని కుడిచేత్తో అన్నం గరిటను బయటకు లాగిన శేషగిరి, చేతిలో అన్నం గరిటతో రొమ్ముమీద వేడి వేడి అన్నపు ముద్దలతో, శరవేగాన దూసుకు వెళ్ళి మూడుగజాల అవతలవున్న మంచి నీళ్ళ బిందెమీద పడ్డాడు.

నీళ్ళు కాలవలైపారాయి. చినిగిపోయిన పేంట్లూ అవీ తెచ్చి నీటిని అద్ది మళ్ళీ కూర్చున్నారు.

ఈసారి శేషగిరి మరీ ఉగ్రంగా-"ఒరేయ్ సీనియర్! నీవు గిన్నెను ఈ ప్రక్కన పట్టుకో. జూనియర్! నువ్వాప్రక్క-!" అని తాను రెండుచేతులతోనూ గరిటను పట్టుకుని, ఎట్టకేలకు, అన్నాన్ని బయటకు తోడాడు...

—కూర, పప్పు, వడ్డించుకున్నారు. భోజనం మొదలెట్టారు.

"అన్నం మరీ ఇంత జావలా వుందేం?"

"నూకలు నూకలుగా వున్నట్టుంది..."

"జావా, నూకలూ అయితే ఎంతో మేలు...నాకు వుత్తరాళ్ళే వస్తున్నాయి."

—"వేపుడు ఏదో వాసన వేస్తుందేం?"

"ఇది బెండకాయ కాదేమిటి?"

"ఈ నల్లనల్ల ముక్కలేమిటో?"

—"బీరకాయ ముక్కలు చేదుగా వున్నాయేం?"

"పప్పులో వుప్పెక్కువయి నట్టుందే..."

"పప్పు మరీ ఇంత నీళ్ళయిందేం?"

—"అయితే శేషగిరీ కనీసం పెరుగయినా వేసుకు తిందాం."

"హు... నే నెటూ హోటల్ భోజనమే కదా అని పెరుగమ్మాయిని ఇవాళ్టినుంచీ రావద్దని చెప్పా నిన్న..."

*　　*　　*

బొగ్గు మరకలున్న పంచతో శేషగిరీ, గుండీలు పెట్టుకోని చొక్కాతో సీనియరూ, తిరగేసి తొడుక్కున్న బనియనుతో జూనియరూ—పరుగెడుతున్నారు 'పర్వత విలాస్' వైపు.

"ఎంతయినా- ఈ వండుకోవడం బాధే..."

"ఆయినా...హోటళ్ళు మరీ మన మనుకున్నంత అన్యాయంకాదు—"

"ఇంటితిండి తిని తిని, హోటల్లో ఎప్పుడెప్పుడు భోంచేద్దామా అని వుందసలు..."

—ఆకలితో మాడిపోతూన్న ఆ ముగ్గురిలో ఏ ఒక్కడికీ కూడా, అప్పుడు ఒంటిగంట కావస్తూన్నదనీ, ఆరోజు ఆఫీసు లున్నాయనీ గుర్తుకు రాలేదు...' ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad